మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | మంగళవారం | 28-10-2025 | సంపుటి : 14 | సంచిక :141 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Tuesday | 28-10-2025 | Volume :14 | Issue:141 | Pages:8 | Cost : 3 |


విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
నమస్తే హైదరాబాద్
తెలుగు దిన పత్రికకు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం
Ph: 9912580066



# మొంథా తుఫాను ఎఫెక్ట్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్) : ): మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి మరో మూడు రోజులు అత్యంత భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మొంథా తుపానుగా మారిందని తెలిపారు. మొంథా తుపాను కాకినాడకి 570 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 600 కిలోమీటర్ల పరిధిలో కేంద్రీకృతం అయిందని చెప్పుకొచ్చారు. రేపు(మంగళవారం) ఈ తుపాను ఉత్తర వాయవ్య దిశలో కదిలి తీవ్ర తుపానుగా మారనుందని పేర్కొన్నారు. ఈ తీవ్ర తుపాను మంగళవారం రాత్రి, లేదా ఎల్లుండి(బుధవారం) ఉదయంలోగా మచిలీపట్నం, కళింగపట్నం ఇంచుమించు.. కోస్తా ఆంధ్రప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు. తుపాను ప్రభావంతో ఈరోజు(సోమవారం) నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని వివరించారు. మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు.మంగళవారం, బుధవారం భారీ నుంచి అతి భారీ వర్ష సూచన ఉండే అవకాశం ఉందని వివరించారు.

మంగళవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు ప్రకటించారు. మంగళవారం 19 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని వెల్లడించారు.

బుధవారం ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు అత్యంత భారీ వర్ష సూచన ఉంటుందని తెలిపారు. తుపాను దృష్ట్యా ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని ప్రకటించారు. అలాగే, ఎల్లుండి బుధవారం నిర్మల్, మంచిర్యాల, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో కీలక సమీక్ష..



హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్) : మొంథా తుఫాన్ ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కీలక సమీక్షా సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రంపై తుఫాన్ ప్రభావం ఏ మేరకు ఉంటుందనే విషయం గురించి చర్చ జరిగింది. అలాగే తుఫాన్ ప్రభావం కారణంగా ధాన్యం కొనుగోళ్లకు ఆటంకం లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. టార్పాలిన్‌లను వినియోగించి ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. వీటిల్లో ఇప్పటికే 4,428 కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. మిగిలినవి త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 22, 433 మంది రైతుల నుంచి 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం విలువ దాదాపు రూ. 431.09 కోట్లు ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు ఈ ప్రక్రియలో ఎవరిపైనైనా అవినీతి ఆరోపణలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నష్టం జరిగితే తమ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## మైనారిటీలను కాంగ్రెస్ మోసం చేసింది: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్) : రాష్ట్రంలో మైనార్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మైనారిటీ నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మైనార్టీల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్ పెడతామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తాము కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదని కొనియాడారు. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు.. కానీ ఇక్కడ చెప్పరని విమర్శించారు. బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్ గాంధీ విమర్శించారని.. ఇక్కడ అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు.హైడ్రా గురించి రాహుల్ గాంధీ సైలెంట్‌గా ఉంటారని విమర్శించారు. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యే పార్టీ మారారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగాలని.. వాళ్లు సమాధానం చెప్పలేరని విమర్శించారు. ఇదే విషయంపై కడియం శ్రీహరిని ప్రశ్నిస్తే.. 'ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నా' అని సమాధానం చెప్పారని.. ఇది వాళ్ల పరిస్థితి అంటూ ఎద్దేవా చేశారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు నింపే సంస్థలని రాహుల్ గాంధీ విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని వ్యాఖ్యానించారు.రేవంత్ రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాయని.. బదులుగా రేవంత్ రెడ్డి కూడా బీజేపీ నేతలకు లాభం చేకూరుస్తారని ఆరోపించారు. మోదీ తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తొందరగా ఇక్కడ రేవంత్ అమలు చేస్తారని విమర్శించారు. ఇది బడే భాయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన పని అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. ఇది కాంగ్రెస్–బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని దుయ్యబట్టారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్‌కు కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి అజారుద్దీన్‌ను పక్కన పెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో అజారుద్దీన్ కట్ షాట్‌లు కొడితే.. ఇక్కడ అజారుద్దీన్‌నే రేవంత్ రెడ్డి కట్ చేసేశారని ఫైర్ అయ్యారు. మహిళలకు ఫ్రీ బస్ అని చెప్పి.. పురుషులకు టికెట్ రేట్ డబుల్ చేశారని విమర్శించారు.

## బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



కరీంనగర్ , అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్) : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మహిళా అధికారులను కాంగ్రెస్ మంత్రులు వేధిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంటికి పిలిచి వార్నింగ్‌లు ఇస్తున్నారని విమర్శించారు. అర్ధరాత్రి మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మహిళల నమ్మకం కోల్పోయిందని ఎద్దేవా చేశారు బండి సంజయ్ కుమార్ ఇవాళ( సోమవారం) కరీనంగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియా తో కేంద్రమంత్రి మాట్లాడారు. మహిళా అధికారులపై కాంగ్రెస్ మంత్రుల వేధింపులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులని వేధింపులకి గురిచేసిన ఆ మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపించారు బండి సంజయ్ కుమార్.పోలీసులపై రౌడీషీటర్లు హత్యాయత్నం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదా..? అని ప్రశ్నించారు. పట్టపగలు గోరక్షకులపై కాల్పులు జరిపితే ఏం చేస్తున్నారు..? అని నిలదీశారు. తప్పు చేసిన రౌడీషీటర్లకు ఎంఐఎం అండగా ఉంటే వారికే వత్తాసు పలుకుతారా..? అని ఫైర్ అయ్యారు. ఒక వర్గం ఓట్ల కోసం ఎంఐఎం నేతల కాళ్లు పట్టుకునే దుస్థితిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. మహిళలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పుకొచ్చారు బండి సంజయ్ కుమార్.

నెలకు రూ.2,500లు, తులం బంగారం, స్కూటీపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. రౌడీషీటర్లు బయటకు రావాలంటేనే గజగజ వణికేలా చేయాలని హెచ్చరించారు. సర్దార్ వల్లభాయిపటేల్ 150వ ఐక్యతా మార్చ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సర్దార్ వల్లభాయిపటేల్ చరిత్ర తెలుసుకోవాలని బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

మరోవైపు.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే ఆరు గ్యారెంటీలని అమలు చేస్తుందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు సెటైరికల్ పోస్టర్ ఆవిష్కరించారు.

1.రౌడీ షీటర్లపై కేసులు ఎత్తివేత.

2. మామూళ్లు హఫ్తా వసూలు చేసేందుకు రౌడీ షీటర్లకు ప్రత్యేక లైసెన్సులు జారీ.

3. బెదిరింపులకు పాల్పడినా కేసులు నమోదు చేయం..

## రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి హరీశ్ రావుకు లేదు: పొన్నం



హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్) : బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి హరీశ్ రావుకు లేదని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లను ఆదుకునే బాధ్యత తమదని చెప్పారు. కేబినెట్ పై హరీశ్ రావు చేసిన ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. డైవర్షన్ పాలిటిక్స్ ను హరీష్ రావు బంద్ చేయాలని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో

2లో

## దశాబ్దాల సమస్యలకు గంటల్లో పరిష్కారం..



హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్) : దశాబ్దాల నాటి సమస్యలకు గంటల్లో, రోజుల్లో పరిష్కారం చూపుతోందంటూ పలువురు తమ పనితీరును ప్రశంసిస్తున్నారని హైడ్రా స్పష్టం చేసింది. కబ్జాలు జరుగుతుంటే నగర ప్రజలు చూస్తూ ఊరుకోవడంలేదని.. నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారని తెలిపింది. సోమవారం ప్రజావాణికి 52 ఫిర్యాదులందాయని పేర్కొంది. త్వరితగతిన పరిష్కారం లభిస్తున్నందువల్లే ఫిర్యాదులు చేస్తున్నారని వివరించింది. చాలా మంది బాహాటంగా ఫిర్యాదు చేస్తున్నారని.. మరి కొంతమంది తమ వివరాలు బయట పెట్టవద్దని అధికారులకు సూచిస్తున్నారని తెలిపింది.కూకట్‌పల్లిలోని హస్మత్‌పేట గ్రామంలో ప్రభుత్వానికి చెందాల్సిన 10 ఎకరాలు కబ్జా చేసేస్తున్నారంటూ తమకు ఫిర్యాదు అందిందని హైడ్రా స్పష్టం చేసింది. తూములు మూసేసి, అలుగులు ఎత్తు పెంచడంతో చెరువు పై భాగంలో ఉన్న భూములు, లేఔట్‌లు నీట మునుగుతున్నాయని కొంతమంది కంప్లైట్

2లో

# రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి హరీశ్ రావుకు లేదు: పొన్నం

కంటోన్మెంట్ ఫలితాలు రిపీట్ కాబోతున్నాయని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ లో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ నుండి తెలంగాణ భవన్ వరకు హరీశ్ ఆటోలో ప్రయాణించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే కనీసం రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుందని.. ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తారని బీఆర్ఎస్ మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 12000 ఇస్తామని మోసం చేసిందని దుయ్యబట్టారు. వెంటనే బాకీ పడ్డ రూ.24 వేలను ప్రతి ఆటో డ్రైవర్‌కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం ఆటో కార్మికులకు రెండు సంవత్సరాల బాకీ చెల్లించినా రూ. 1500 కోట్లు అవుతుందని చెప్పారు. రూ. 3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై రూ. 3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయన్నారు. అందులో నుంచి రూ. 1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి ఆటో కార్మికులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 161 ఆటో కార్మికులు చనిపోయారని.. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# దశాబ్దాల సమస్యలకు గంటల్లో పరిష్కారం.. హైడ్రాకు ప్రశంసలు

చేసినట్లు తెలిపింది. మరికొంత మంది చెరువుల్లో మట్టి పోసి ఎకరాలకొద్దీ కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు వివరించింది. ఈ ఫిర్యాదులను కమిషనర్ రంగనాథ్ నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పజెప్పారని తెలియజేసింది. హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు ఇలా..శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామం పరిధిలోని సరసింహకుంట తూములు మూసేసి.. అలుగు ఎత్తు పెంచడం వల్ల ఎఫ్‌టీఎల్ కంటే ఎక్కువ నీరు నిలిచి తమ పంట పొలాలు మునిగిపోయాయని ఆ గ్రామ ప్రజలు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ, మండలంలోని బీరంగూడలో ఉన్న శాంబుని కుంట కబ్జాలకు గురి అవుతోందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సాగర్‌రోడ్డులో ఉన్న యశోదనగర్ కాలనీలో శివారు ఇంటి స్థలాల వారు రోడ్డును కలిపేసుకుని దారి లేకుండా చేస్తున్నారని యశోదనగర్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.కూకట్‌పల్లి ప్రాంతంలో పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రి మట్టిపోసి నింపుతున్నారని.. నంబరు ప్లేటు లేని వాహనాలను వినియోగిస్తున్నారని అక్కడి నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువులోకూడా మట్టిపోసి.. భవన నిర్మాణాలు చేపడుతున్నారని.. అడ్డుకున్న తమపై దాడి చేయడమే కాకుండా.. స్థానిక పోలీసు స్టేషన్లో కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు కంప్లైంట్ చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ మండలం, హస్మత్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై

# తెలంగాణ టెన్నిస్ వాలీబాల్ టీం కెప్టెన్ గా నిఖిల్



**ఘట్కేసర్ అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్)** మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ఎఫ్సి నగర్ లో ఉండే చిలుగురి నిఖిల్ తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ వాలీబాల్ టీమ్ కెప్టెన్ గా ఎన్నికయ్యారు. నిఖిల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ వాలీబాల్ టీం కి కెప్టెన్ అయినందుకు చాలా సంతోషపడుతున్నానని, రాష్ట్రానికి కప్పు వచ్చేలా చూస్తానని అన్నారు. ఘట్కేసర్ లోని ప్రముఖులు నిఖిల్ ని కలిసి అభినందనలు తెలియజేయడం జరిగింది.

# చందానగర్ గంగారం చెరువు వద్ద ఘనంగా చట్ పూజలు.... .

## హాజరైన పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** ఉత్తర భారతీయ రాష్ట్రాలకు చెందిన ప్రజలు సోమవారం చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు వద్ద చట్ పూజలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ,మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత పవిత్రంగా కొలిచే గొప్ప పండుగ ఛట్ పూజ అని , బీహార్, జార?ండ్ మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, చండీగఢ్, గుజరాత్, గయ, రాంచీ, ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాల్లో ప్రముఖంగా కార్తీక మాసంలో జరుపుకునే పూజ ఛట్ పూజ అని తెలిపారు.భూమి మీద తమకు మనుగడ కల్పిస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ, ఆయురారోగ్య, ఆనందాలను ప్రసాదించమని ప్రార్థిస్తారు. సూర్యుని ఆరాధించడం వల్ల కుష్టు వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమవుతాయి నమ్ముతారు.పవిత్ర నదిలో పుణ్య స్నానం చేసి నీటిలో వీలైనంత ఎక్కువ సేపు నిలబడి సూర్యభగవానుని ఆరాధిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి ప్రగఢ సత్యనారాయణ,విష్ణు వర్ధన్ రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి,రాజేందర్, లక్ష్మణ్, సురేష్ నాయక్, ప్రభాకర్ రెడ్డి, అనిల్,నగేష్, శ్రీనివాస్, పింటు, రాకేష్ అజయ్ ,రాజీవ్ సింగ్ నాయకులు ,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి మిల్లులలో సి సి ఐ కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యెల్సోజు చామంతి





**తిరుమలగిరి ,అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్ ప్రతినిధి):** తిరుమలగిరి నాగారం మండల పరిధిలోని పత్తి మిల్లులలో సి సి ఐ కేంద్రాలను ప్రారంభించిన తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యెల్సోజు చామంతి నరేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి రైతులందరూ వ్యవసాయ శాఖ కార్యాలయంలో పంట రికార్డును నమోదు చేసుకుని పొంటున్న అమ్ముకునే ఒకరోజు ముందు కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. రైతులందరూ పత్తిని ఎనిమిది ప్రేమ శాతం వచ్చే విధంగా చూసుకొని ప్రభుత్వం మద్దతు ధర 8100 రూపాయలు పొందాలని 12 కంటే తేమ శాతం ఎక్కువగా ఉంటే సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయబడుదని చెప్పారు. మార్కెట్ సిబ్బంది పత్తి మిల్లు యాజమాన్యులు సిసిఐ యాజమాన్యం రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు రెండు మండలాల తాసిల్దార్లు వ్యవసాయ శాఖ అధికారులు సీసీఐ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పొట్ల రామ నరసయ్య వారసత్వాన్ని కొనసాగిస్తాం

**గోకినపల్లి వెంకటేశ్వరరావు సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

**సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీలో తిరుమలగిరి నుండి 80 కుటుంబాలు చేరిక**




**తిరుమలగిరి,అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్ ప్రతినిధి):** తిరుమలగిరి పట్టణ కేంద్రం నుండి సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీలో 80 కుటుంబాలు ఈరోజు ఆదర్శనగర్ లో చేరారు వీరికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పార్టీ గోగినపల్లి వెంకటేశ్వరరావు, మాస్ లైన్ పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ,పిఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి స్వరూప శిరోమణి సూర్యాపేట జిల్లా పిఓడబ్ల్యూ కార్యదర్శి కొత్తపల్లి రేణుక పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న వారికి పార్టీ కండువగప్పి సాదరంగా ఆహ్వానిస్తూ కామ్రేడ్ పొట్ల నరసయ్య వారసత్వాన్ని కొనసాగిస్తామని అన్నారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలగిరి గడ్డ విప్లవ పోరాటాలకు పుట్టినిల్లుని కామ్రేడ్ పొట్ల రామ నరసయ్య అమరత్వం ఈ గడ్డకు చెరగని విప్లవ చరిత్రని లిఖించిందని అన్నారు సిపిఐ ఎంఎల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పొట్ల రామ నరసయ్యని 1976లో ఎమర్జెన్సీ కాలంలో ఇప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం బూటకపు ఎన్కౌంటర్ చేసిందని అన్నారు ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ ఈ ప్రాంతంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ప్రజా పోరాటాలను ఉదృతం చేస్తుందని అన్నారు సూర్యాపేట జిల్లాలో మాస్ లైన్ పార్టీ చేస్తున్న ప్రజా పోరాటాలను చూసి పార్టీ యొక్క రాజకీయాలను నచ్చి తిరుమలగిరి పట్టణం నుండి 80 కుటుంబాలు పార్టీలో చేరడం అభినందనీయమని అన్నారు వారందరూ పార్టీ కుటుంబ సభ్యులు అని వారికి ఎలాంటి కష్టం వచ్చినా పార్టీ ముందుండి వారిని అన్ని రకాలుగా ఆదుకుంటుందని అన్నారు నియంతృత్వ పాలక పార్టీల విధివిధానాలు నచ్చక పేద ప్రజలకు విప్లవ పార్టీ అండగా ఉంటుందని నమ్మి వచ్చిన ప్రజలకి విప్లవ అభినందనలు తెలియజేస్తూ తిరుమలగిరి ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి అన్ని రకాలుగా తోడ్పడాలని వారిని కోరారు ఇకనుండి తిరుమలగిరి ప్రాంతంలో పాలక పార్టీలు చేస్తున్న అన్యాయాలపై అక్రమాలపై మాస్ లైన్ పోరాటాలు చేస్తుందని అన్నారు

# శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునుడి సేవలో తుదుగని రాజలింగం కుటుంబం...





## భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసిన తుదుగని రాజలింగం...

**ఘట్ కేసర్ అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్)** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపల్ పరిధి ఎదులాబాద్ గ్రామంలో శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆ దేవ దేవుడికి ఆలయ ధర్మకర్తలు కంట్లం వంశస్థుల ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వామి శ్యాం కుమార్ కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్తీకమాసోత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం కావడంతో గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, భక్తుడు తుదిగని రాజలింగం దంపతులు, కుమారుడు ముకేశ్ కుమార్ దంపతులు తెల్లవారుజామునుండే పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి కోటి వత్తులను వెలిగించారు.

ఈ మేరకు మధ్యాహ్నం భక్తులకు తుదుగని రాజలింగం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిధి ఘట్కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కంట్లం గౌరీ శంకర్, గుట్టప్ప, నరేష్, నవీన్ కుమార్, ప్రదీప్ కుమార్, నాయకులు గాయరు విశ్వనాథం, కాలేరు రామోజి, ఉప్పు లింగేశ్వర్, ఎదిగని శ్రీరాములు, గ్రామ ప్రజలు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.ఈ సందర్భంగా అన్న దాత రాజలింగం ని ఆలయ ధర్మకర్తలు శాలువాతో సత్కరించారు.

# నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి : టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా.. బేగంపేటలోని హెూటల్ ద ప్లాజాలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,తదితర శాసన సభ్యుల సమక్షంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, పంజాగుట్ట కార్పొరేటర్, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డి,అల్విన్ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గారు భారీ మెజారిటీతో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి సమావేశంలో చర్చించుకున్నట్టు తెలిపారు. విద్యావంతుడు, యువతలో మంచి పేరు ఉన్న వ్యక్తి, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నిలబెట్టే సత్తా ఉన్న నవీన్ యాదవ్ ని గెలుపుంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.



# గోల్డెన్ నంది అవార్డు అందుకున్న గుంజ గంగారావు

**నమస్తే హైదరాబాద్** పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గుంజా గంగారావు సినీ ఫీల్డ్ స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ ఫౌండర్ కె.వై. గిరిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గోల్డెన్ నంది అవార్డును ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు చేతుల మీదగా ఆదివారం సాయంత్రం అందుకున్నారు . కరోనా సమయంలో జబర్దస్త్ ఆర్టిస్టులను, సినీ ఆర్టిస్టులను గంగారావు వెన్ను దన్నుగా నిలిచి తనకున్న దాంట్లో ఆర్థికంగా సామాజిక సేవతో ఆదుకున్నారు . ఈ మంచి మనసు చూసిన జబర్దస్త్ టీం, సినీ ఆర్టిస్టుల టీం గంగారావుకు నంది అవార్డు రావడానికి కారణమయ్యింది . ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు నన్ను ప్రత్యేకంగా గుర్తుంచుకొని పిలిపించి అవార్డు ఇవ్వటం మర్చిపోలేనని పెదకూరపాడు నియోజకవర్గానికి, బెల్లంకొండ మండలానికి ఈ అవార్డు అంకితం చేస్తున్నానన్నారు ఈ కార్యక్రమంలో జబర్దస్త్ చిట్టిబాబు, అజయ్ ఘోష్, సమీర్, చారు తదితరులు పాల్గొన్నారు

# ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు శ్రీరాములు

## చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది





**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్)** దేవరుప్పుల మండలం ధర్మ పురం గ్రామంలోని సోమవారం ఏర్పాటు చేసిన నూతన ఐకెపి సెంటర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి చేతుల మీదుగా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల ఆండాలు శ్రీరాములు మాట్లాడుతూ. వరి ధాన్యం రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఎనలేని సేవలు చేస్తున్నారని అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి . టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి రైతులకు ఎలాంటి ఇబ్బంది వచ్చిన ఆదుకుంటున్నారని. రైతే రారాజు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోని. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.

# జలమండలి ఔట్సోర్సింగ్ సిబ్బందిని ఐఎంఎస్ఐ ఎస్ పోర్టల్లో చేర్చకపోవడం అన్యాయం





**హైదరాబాద్, అక్టోబర్ 27( నమస్తే హైదరాబాద్):** జలమండలి లోని అధికారులు ఐ ఎం ఎస్ ఐ ఎస్ పోర్టల్ లో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల డేటా ని అప్డేట్ చేయడం లో నిర్లక్ష్యం కళ్ళకు కట్టినట్లు కనబడుతుందని తెలంగాణ అవుట్సోర్సింగ్ జేఏసీ అధ్యక్షులు పులి లక్ష్మయ్య, సిద్ధి రాములు స్పష్టం చేశారు. గవర్నమెంట్ వారు ప్రతి ఒక్కరి డేటా ని నమోదుచేయమంటే మాకు ఎలాంటి ఆర్డర్ రాలేదని అంటూనే ప్రతి పర్మినెంట్ ఉద్యోగి డేటా ని ఐ ఎం ఎస్ ఐ ఎస్లో నమోదు చేసుకున్నారు కానీ అదే జలమండలి లో పని చేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగుల డేటా మాత్రం చేయలేదని, ఇందులో లైన్మెన్, మీటర్ రీడర్స్/బిల్లు కలెక్టర్, డబ్ల్యూటిపి, ఎస్ టి పి, క్యూ ఏటి గార్డెన్ వర్కర్స్, డిపిఒ, సేవరేజ్ వర్కర్స్, పంపు ఆపరేటర్,ఇంకా వివిధ రకాల కార్మికులు సుమారు 5 వేల పై చిలుకు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల డేటా ని ఐ ఎం ఎఫ్ ఐ ఎస్ లో ఐ ఎం ఎఫ్ ఐ ఎస్లో నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25 లోపు చేయాలని గవర్నమెంట్ ఎంత చెప్పినా వినకుండా వారిది మాత్రం చేసుకున్నారు. ముందు పర్మినెంట్ ఉద్యోగుల జీతాలు ఆపితే అందరూ సక్రమంగా పని చేస్తారని వారు పేర్కొన్నారు.

# హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో టీయూడబ్ల్యూజే ఘన విజయం

## గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సంబరాలు






**హనుమకొండ ,అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్ )** ఎంతో ప్రతిష్టాత్మకంగా, హోరా హోరీగా జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో టీయుడబ్ల్యూజే మద్దతుతో పోటీ చేసిన ఫ్రెండ్స్ ప్యానెల్ అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించింది. దీంతో హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు సంబురాలు జరుపుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకుని హైదరాబాద్ లో ఐజేయూ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఐజేయూ ఘన విజయానికి ఎంతో కృషి చేసి ప్యానల్ ను గెలిపించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో విషసర్పాలన్నీ ఏకమై, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, చారిత్రాత్మక తీర్పుతో చెంపపెట్టు లాంటి సమాధానం చెప్పి, ఫ్రెండ్స్ ప్యానెల్ మొత్తాన్ని అనూహ్య మెజారిటీతో గెలిపించిన హైదరాబాద్ జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. టీయూడబ్ల్యూజే పట్ల ఉన్న విశ్వాసాన్ని, అభిమానాన్ని చాటుకున్న హైదరాబాద్ జర్నలిస్టులకు వారు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ సభ్యుల విశ్వాసాన్ని వమ్ముచేయకుండా, వారి రుణాన్ని తీర్చుకోడానికి నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పెండెం వేణుమాధవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పివి. మదన్ మోహన్, గడ్డం కేశవమూర్తి, పిన్నా శివ కుమార్, యూనియన్ నాయకులు %ఎష్ట్ర% సోమ నర్సయ్య,కెంచ కుమారస్వామి, మాదం రజినీకుమార్, డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, సాయిరాం, యాంసాని శ్రీనివాస్, మంచాల రాజు, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, రామ్మోహన్, సంపతి ప్రభాకర్, తాండూరి గోపి, కొమ్మాలు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం మారెళ్ళ వీరాంజనేయులు (స్వామి)



**నమస్తే హైదరాబాద్ )** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆస్తులు ఎన్ని ఉన్నా జానెడు పొట్ట నిండక పోతే ఆస్తులన్నీ శూన్యం అని, అందుకే ప్రతి మానవుడు అన్నంను పరబ్రహ్మ స్వరూపంగా చూడాలని , సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ళ వీరాంజనేయులు (స్వామి) సోమవారం అన్నారు . భరతమాత అన్నప్రసాద వితరణ పథకం ద్వారా దాతల సహకారంతో నిరుపేదల ఆకలి తీర్చటం అభినందనీయం అని తెలిపారు . పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో భరతమాత అన్నప్రసాద వితరణ పథకం 737 వ రోజు ఇద్దరు దాతల సహకారంతో 40 నిరుపేద రోగులకు బోజన ప్యాకెట్లను పంపిణీ చేయటం జరిగింది. సోమవారం మధ్యాహ్నం 1 గంటకు,సత్తెనపల్లి పట్టణంలోని విశ్రాంత ప్రిన్సిపాల్ ఎమ్.వి.ఎల్ నరసింహారావు జన్మదిన సందర్భంగా ఆయన ఆర్థిక సహాయంతో 30 మందికి నరసింహారావు దంపతుల చేతులమీదుగా భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు.మరో దాత పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బుడగాల సుబ్బారావు జన్మదిన సందర్భంగా సుబ్బారావు ఆర్థిక సహాయంతో మరో 10 మందికి ఆయన చేతులమీదుగా భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారులి ఈ కార్యక్రమంలో పిజియో థెరపీ డాక్టర్ కరుణాకర్,సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కో క్లస్టర్ జింకా లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లాటరీ పద్ధతిన మద్యం షాపుల కేటాయింపు 67 మద్యం షాపులకు డ్రా తీసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ అక్టోబర్ 27 నమస్తే హైదరాబాద్** వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని 67 మద్యం షాపులకు లాటరీ డ్రా ను సోమవారం తీశారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి లాటరీ డ్రాను తీసేందుకు ఏర్పాట్లు చేయగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై డ్రా తీశారు. 67 మద్యం షాపులకు గాను 3175 దరఖాస్తులు రాగా లాటరీ పద్ధతిన డ్రాను తీశారు. ఒక్కో మద్యం దుకాణానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సమక్షంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ డ్రా తీసి సంబంధిత నెంబర్ ను ప్రకటించారు. మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి లాటరీ పద్ధతిన డ్రా లో కేటాయించబడిన అభ్యర్థికి కేటాయింపు పత్రం ఎక్సైజ్ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎక్సైజ్ శాఖ సిఐలు,ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్ డివిజన్ సమస్యను పరిష్కరించాలని జలమండలి ఎండి ని కలిసిన మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 27 ( నమస్తే హైదరాబాద్)** ఉప్పల్ డివిజన్ లోని పలు సమస్యలను జలమండలి ఎండి అశోక్ రెడ్డి ని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి సోమవారం కలిసి దృష్టికి తీసుకువెళ్లారు. ఉప్పల్ డివిజన్ లోని సూర్య నగర్ కాలనీ మిషన్ భగీరథ ఎక్స్టెండ్ లైన్ కొరకు, కురుమ నగర్ లోని పేస్ -3 యుజిడి లైన్ సమస్యలను పరిష్కరించాలని అశోక్ రెడ్డి వివరించి పరిష్కరించాలని కోరారు. జలమండలి ఎండి వివరించిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే కి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బిజెపి డివిజన్ అధ్యక్షులు మారినేని ఫణింద్ర, ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్ లు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి,ఆర్ గవాయి గారి పైన దాడి చేసిన రాకేష్ కిషోర్ ని అరెస్ట్ చేయాలి ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి డిమాండ్



**ధర్మసాగర్( నమస్తే హైదరాబాద్ ):** నవంబర్ 1న హైదరాబాద్ లో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలనికందుకూరి సోమన్న మాదిగ ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి అనుబంధ సంఘాల హనుమకొండ జిల్లా ఇన్చార్జి బండారి సురేందర్ మాదిగ ఎం ఎస్ పి హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజేఐ గవాయి గారి మీద జరిగిన దాడిని ఖండిస్తూసోమవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఎం ఎస్ పి హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి ఎం ఎస్ పి
గంగారపు శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్
ఎం ఎస్ పి అనుభంద సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్చార్జి కందుకూరి సోమన్న మాదిగ మరియు ఎం ఎస్ పి హనుమకొండ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి గారి మీద జరిగిన దాడి ముమ్మాటికీ కావాలని జరిగిన దాడి గా ఆరోపించారు ఈ దాడి న్యాయ వ్యవస్థ భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై మరియు దళిత సమాజంపై జరిగిన దాడిగా భావిస్తామని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సుమోటగా తీసుకొని దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో
ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు సింగారపు పవన్ మాదిగ,
వీహెచ్పీఎస్ మండల అధ్యక్షులుమాచర్లబాబు మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల సహాయ కార్యదర్శి మట్టెడ బాలస్వామి,
ఎం ఎస్ పి మండల నాయకులు పోలుమారి బాబు,ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి నాయకులు
చిలక రాజు, చింత తిలక్, గాదె భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసం మొదటి సోమవారం.. వెలుగు గుట్ట దేవాలయంలో పోటెత్తిన భక్తులు





**ఉప్పల్, అక్టోబర్ 27 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ వెలుగుగుట్ట ఆలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో వెలుగుట దేవాలయంలో భక్తులు పోటెత్తారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పెద్దిగారి శ్రీకాంత్, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో కార్తీక మాసం పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 27వ తేది కార్తీకమాసం మొదటి సోమవారం ఉదయం 4.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మహాన్యాన పూర్వక రుద్రాభిషేకం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, ఆకాశ దీపార్చన, సహస్ర బిల్వార్చన, హరతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఈవో శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు హజరుకావచ్చని తెలిపారు. కార్తీక మాసం మొదటి సోమవారం ఆలయంలో ఈవో పెద్దిగారి శ్రీకాంత్, ఆలయ కమిటి ప్రతినిధి గౌరిగె మల్లేష్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి ఉసిరి చెట్టు కింద భక్తులు వనభోజనాలు చేశారు. కార్తీక మాసం పూర్తయ్యే వరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వెల్లడించారు.

# ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యములో లక్ష దీపోత్సవం




**ఉప్పల్, అక్టోబర్ 27 ( నమస్తే హైదరాబాద్):** శ్రీ విశ్వావసు నామ సంవత్సర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీ శనివారం నుండి 5వ తేదీ బుధవారం వరకు ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ భగవత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్లాట్ నెంబర్ 203, కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో లక్షదీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నవంబర్ 1వ తేదీ శనివారం సాయంత్రం గణపతి పూజ, రుద్రాభికేశం, విష్ణు సహస్రనామ పారాయణం, దీపార్చన 2 వ తేదీ సాయంత్రం రుద్రాభికేశం, లలిత సహస్రనామ పారాయణం, దీపార్చన 3వ తేదీ రుద్రాభికేశం, సహస్రనామ బిల్వార్చన, దీపార్చన 4 వ తేదీ సాయంత్రం రుద్రాభికేశం, దీపార్చన 5వ తేదీ సాయంత్రం పార్వతి పరమేశ్వర కళ్యాణం, దీపార్చన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇటు పదేళ్ల ప్రగతి...అటు రెండేళ్ల మోసం: కార్పొరేటర్ బన్నాల గీత

### కారు కావాలో... ? బుల్డోజర్ కావాలో.. ?
### ప్రజలు ఆలోచించండి : కార్పొరేటర్ బన్నాల గీత





**జూబ్లీహిల్స్, అక్టోబర్ 27 (నమస్తే హైదరాబాద్):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డి గూడ బూత్ నంబర్ 294, 295, 296 లలో ఎల్లారెడ్డి గూడ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

అనంతరం ప్రచారంలో భాగంగా వారు ఇంటింటికి వెళుతూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కి ఓటు అభ్యర్థన చేస్తూ కారు గుర్తు పై ఓటు వేయాలని కోరడం జరిగింది.

బిఆర్ఎస్ పార్టీకి కారు గుర్తుపై ఓటు వేయాలని పదేండ్ల బిఆర్ఎస్ ప్రగతి పాలనను రెండేళ్ల కాంగ్రెస్ మోసాల పాలనను బేరీజు వేసుకొని ఓటు వేయాలని ఎల్లారెడ్డి గూడ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అడ్డగోలు హామీలు మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిందని గుర్తు చేశారు.పదేళ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్ సంపూర్ణ అభివృద్ధి సాధించిందని నాడు అధికారంలోకి వచ్చిన వెంటనే కెసిఆర్ ప్రభుత్వం నిరంతర విద్యుత్తు ని ఉచిత మంచినీటిని మరియు రజకులకు ,నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు ని అందించిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ గారి ప్రభుత్వమని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంచినీకి పెద్ద ఎత్తున బిల్లులు వసూలు చేస్తుందని తెలుపుతూ మరొక్కసారి మీ అందరూ కారు గుర్తుపై ఓటు వేసి సునీత గోపీనాథ్ గారిని గెలిపించమని అభ్యర్థన చేస్తూ ప్రచారం సాగించారు.కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువులు దుకాణము తనిఖీ



**నమస్తే హైదరాబాద్):** పట్టణం లోని శ్రీ ధనలక్ష్మి ఎంటర్ప్రైజెస్ ఎరువుల దుకాణం ను మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డి ఏ పి తదితర ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వడం లేదని గమనించి 6.2 లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలంటూ నోటీసు జారీ చేశారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. రైతులకు రసీదులు ఇవ్వకపోయినా, అధిక ధరలకు విక్రయాలు జరిపిన ఇలాంటి చట్టపరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి , కడియం కావ్య, కడియం శ్రీహరి చిత్రపటాలకు క్షిరాభిషేకం



**ధర్మసాగర్ ( నమస్తే హైదరాబాద్ ):** ధర్మసాగర్ మండలం ఏలుకుర్తి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య దేవాదుల సృష్టికర్త స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత మాజీ ఉపముఖ్యమంత్రి వర్యులు స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ శాసనసభ సభ్యులు కడియం శ్రీహరి చిత్రపటాని చిత్ర పటాల కు ఏలుకుర్తి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మినుముల సురేష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేయడం జరిగినది ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని గత రెండేళ్లలో ఉచిత బస్సు ప్రయాణం ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు ఇస్తుందని స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం ప్రతి గ్రామాలలో కడియం శ్రీహరి యొక్క మార్పు ఉంటుందని మార్కు ఉంటుందని మడికొండ ఎలుకుర్తి ముప్పారం నారాయణ గిరి వరకు పది కిలోమీటర్లు 18 కోట్లతో బీటీ రోడ్డు వచ్చిందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరిశెట్టి సుధాకర్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి వీరయ్య, కో-ఆపరేటివ్ వైస్ చైర్మన్ యాద కుమారస్వామి ,మాజీ చైర్మన్ జోగు మొగిలి, మాదాసి యాదగిరి, గాజుల సదానందం, కొలిపాక మీనయ్య, రాజేందర్ ,వాస్కో రమేష్ సాంబరాజు, అంతానీ, బోర జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు 10,000 /రూ ఆర్థిక సహాయం... ఉప్పలపాటి హరిబాబు (సింగిల్ విండో చైర్మన్)





**నమస్తే హైదరాబాద్)::**పామూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పామూరు సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు మరుగుదొడ్డి నిర్మాణం కొరకు 10,000/ రూపాయలను ఎంఈఓ పెద్దిరెడ్డి కోటిరెడ్డి ,పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు లకు అందజేశారు. పాఠశాలలో బాత్రూమ్స్ అద్వాన స్థితిలో ఉన్న విషయం తెలిసి వెంటనే స్పందించి పాఠశాలకు పదివేల రూపాయలు అందించిన ఉప్పలపాటి హరిబాబు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఎం ఈ ఓ పి కోటిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు శాలువాతో సన్మానించి మెమెంటో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ నాయిబ్ రసూల్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు, పట్టణ టిడిపి కార్యదర్శి కటకం శివ ప్రసాద్ ,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కందుకూరు ను ప్రకాశం జిల్లాలో కలపాలి

### నెల్లూరు జిల్లా నేతల అడ్డగింత సరికాదు
### కలెక్టర్ కు వినతి పత్రం అందజేత



**నమస్తే హైదరాబాద్ )** ,రాష్ట్రం లో వైసీపీ ప్రభుత్యం అడ్డగోలుగా చేసిన జిల్లాల పునర్విభజన ను సరిచేసే కార్యక్రమం లో భాగం గా కొత్త జిల్లాల ఏర్పాటు, కొన్ని నియోజక వర్గాలను జిల్లాల నుండి మార్పులు చేయుటకు కూటమి ప్రభుత్యం చర్యలు తీసుకుంటున్న నేపద్యం లో నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా ను కందుకూరు జే ఏ సి ఆధ్వర్యం లో కలసి కందుకూరు ను ప్రకాశం లో కలపాలని సోమవారంవినతి పత్రంను అందజేశారు, ఈ సందర్భంగా జే ఏ సి నేతలు మాట్లాడుతూ కందుకూరు ప్రాంత ప్రజల ఆకాంక్షకు విరుద్ధంగా నెల్లూరు జిల్లాలో కలిపిన కందుకూరు నియోజక వర్గమును తిరిగి ప్రకాశం జిల్లా లో కలుపుటకు గతం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , యువగళం పాదయాత్ర కందుకూరు వచ్చిన సమయం లో నారా లోకేష్ హామీ ఇచ్చిన నేపథ్యంలో కందుకూరు ను ప్రకాశం జిల్లాలో కలుపుటకు దాదాపు ప్రక్రియ పూర్తి అయిన సందర్భంలో నేడు ఒక ప్రధాన దిన పత్రికలో నెల్లూరు జిల్లా నాయకులు కందుకూరు ను నెల్లూరు జిల్లాలో ఉంచే విధంగా ఒత్తిడి తెస్తున్నారు అని వార్తలు వచ్చిన నేపథ్యం లో ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన కందుకూరును ప్రకాశం జిల్లా లో ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా కలపాలని కందుకూరు జే ఏ సి నాయకులు విజ్ఞప్తి చేశారు.

కందుకూరు ప్రాంత ప్రజలు కందుకూరు ను ప్రకాశం జిల్లా కలుపుతాం అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేష్, కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ల హామీ మేరకు ఎప్పుడూ లేని అత్యధిక మెజారిటీ తో కందుకూరు లో కూటమి ప్రభుత్వం కు పట్టం కట్టారని, అటువంటి కందుకూరు ప్రజల సెంటిమెంట్ ను గౌరవించి కందుకూరు ప్రజలకు మంచి చేయాలని కోరగా మీ విజ్ఞప్తిమేరకు ప్రభుత్వం మంచి నిర్ణయం త్వరలో తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. దానికి ముందు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం లో ఏ ఓ విజయ లక్ష్మికి ఈ విషయమై వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో జే ఏ సి, తెదేపా, బీజేపీ, సిపిఐ, జనసేన పార్టీల నాయకులు బెజవాడ ప్రసాద్, పాలిటి కోటేశ్వరరావు, దామా మల్లేశ్వరరావు, ఘట్టమనేని హరిబాబు, చిలకపాటి మధుబాబు, గోకరాజు మదన్, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, చుండూరి శ్రీను, కొచ్చర్ల శ్రీనివాసులు, ఆనంద్, కొత్తూరి సుధాకర్, ఆత్మకూరి శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.. మండల ప్రత్యేక అధికారి డాక్టర్ చెన్నకేశవులు

**నమస్తే హైదరాబాద్):** పోకూరి మాల్యాద్రి,తుఫాన్ పట్ల మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు అప్రత్తమగా వుండాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎంతోటి చెన్న కేశవులు అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూలిఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికీ కావాల్సిన మౌళిక వసతులు పట్ల బాధ్యత గా వుండాలని తెలిపారు.

# ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ పైన తుఫాను పునరావాస కేంద్రం..

### ఏర్పాట్లను పరిశీలించిన 'కొండపల్లి మున్సిపల్ చైర్మన్' చెన్నుబోయిన చిట్టిబాబు..





**నమస్తే హైదరాబాద్ :** రానున్న రెండు రోజుల్లో తీవ్ర తుఫాను ప్రభావితం ఉందన్న వాతావరణం శ్యాఖ సూచనలు మరియు జిల్లా కలెక్టర్ ముందస్తు జాగ్రత్త వహించి కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ పునరావాస కేంద్రాలను సందర్శించారు.ఇబ్బందులు ఉన్నచోట నుండి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు చైర్మన్. టిడిపి మైనార్టీ నాయకులు షేక్ మహబూబ్ సుభాని కూడా చైర్మన్ వెంట విచ్చేసారు.

– తుఫాన్ హెచ్చరికతో ప్రజలకు విజ్ఞప్తి..తుఫాను వల్ల అధిక వర్షపాతం తో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశాలు ఉన్నాయని, అలాంటి ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పరిస్థితిని బట్టి కొండపల్లి వాసులు అయితే బాలికల ఉన్నత పాఠశాలకు, ఇబ్రహీంపట్నం వాసులు ట్రక్ టర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు మున్సిపల్ చైర్మన్ చెన్నూబోయినా చిట్టిబాబు.

# కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్...!

### ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), రైల్వే అధికారులకు కృతజ్ఞతలు..

### -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.




**నమస్తే హైదరాబాద్ :** కొండపల్లి మున్సిపాలిటీతో పాటు మైలవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజల చిరకాల వాంఛ తీరబోతోంది. ఎట్టకేలకు కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే శాఖ పచ్చజెండా ఊపింది. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి అడుగులు పడటంతో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి చర్యలలో భాగంగా ప్లాట్‌ఫారమ్ విస్తరణ, ఎత్తు పెంపు ప్రతిపాదనకు దక్షిణ మధ్య రైల్వే అంబ్రెల్లా వర్క్స్ 2024-25లో ఆమోదం లభించింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. అమృత్ స్టేషన్ పథకం కింద కొండపల్లి స్టేషన్ అభివృద్ధి తర్వాత దశలో పరిగణనలోకి తీసుకుంటామని కూడా పేర్కొన్నారు. కొండపల్లి స్టేషనులో ఫ్లాట్ ఫామ్ సక్రమంగా లేక ప్రయాణికులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఈ అభివృద్ధి పనులతో ఆ ఇబ్బందులు అన్నీ తొలగిపోనున్నాయి.ఇందుకు సహకరించిన విజయవాడ పార్లమెంట్ సభ్యులు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# 8,140 హెక్టార్లలో పంటలు నష్టం

## ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ



**నమస్తే హైదరాబాద్)** బంగళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 8,140.18 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 159 గ్రామాలకు చెందిన 9,312 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ఇంకా వర్షం వీడకపోవడంతో పంట నష్టాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. పెద్దారవీడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 1,309 మంది రైతులు, మార్కాపురం మండలంలో 15 గ్రామాలకు చెందిన 3,260 మంది, తర్లుబాడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 99 మంది, కంభం మండలంలో రెండు గ్రామాలకు చెందిన 30 మందిరైతులు, అర్ధవీడు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 55 మంది రైతులు, మర్రిపూడి మండలంలో 18 గ్రామాలకు చెందిన 420 మంది రైతులు, పొదిలి మండలంలో 27 గ్రామాలకు చెందిన 185 మంది రైతులు, దర్శి మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 228 మంది రైతులు, కొనకనమిట్ల మండలంలో మూడు గ్రామాలకు చెందిన 258 మంది రైతులు, దొనకొండ మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 389 మంది రైతులకు చెందిన పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. మొత్తమ్మీద పత్తి 6,178 హెక్టార్లు, మొక్కజొన్న 124.06 హెక్టార్లు, సజ్జ 771.40 హెక్టార్లు, జొన్న 5.42 హెక్టార్లు, వేరుశనగ 9.7 హెక్టార్లలో వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు.

# చట్ పూజ కోసం పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు





**ఉప్పల్, అక్టోబర్ 27 ( నమస్తే హైదరాబాద్):** రామంతపూర్ డివిజన్ పరిధిలో నివసిస్తున్న బిహారీ వాసులు ప్రతీ ఏటా ఎంతో భక్తి శ్రద్ధలతో చర్ పూజ ను ఘనంగా నిర్వహిస్తారు. ఈ పూజ ప్రధానంగా సూర్య భగవానుడి ఆరాధనకు సంబంధించినది. రెండు రోజులపాటు జరిగే ఈ పండుగలో ప్రజలు నదులు, చెరువులు, కాల్వల తీరాలలో పూజలు నిర్వహించి సూర్యోదయం, సూర్యాస్తమయ వేళల్లో ఆరాధన చేస్తారు.ఈ సందర్భంగా మహిళలు దీక్ష తీసుకుని ఉపవాసం పాటిస్తారు. పూజలో భాగంగా అరటి, కొబ్బరి, చెరకు, పండ్లు, తీపి పదార్థాలతో సూర్యుడికి నైవేద్యం సమర్పిస్తారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, సూర్య భగవానుని కటాక్షం కోరుకుంటారు.రామంతపూర్ చెరువు వద్ద ఈసారి కూడా వందలాది మంది బిహారీ వాసులు పాల్గొని చర్ పూజ వేడుకలను ఉత్సాహంగా జరుకోనున్నారు. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు చిన్న చెరువు వద్ద అవసరమైన ఏర్పాట్లు ను లైటింగ్, శానిటేషన్, భద్రతా చర్యలు, నీటి సదుపాయాలు వంటి అంశాలను సమీక్షించి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రామంతపూర్ ప్రాంతం వివిధ సంస్కృతులకు నిలయంగా ఉండటమే గర్వకారణమని అన్నారు. చర్ పూజ వంటి పండుగల ద్వారా సాంస్కృతి సంప్రదాయం బలపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ.ఈ. మౌనిక, వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్, సురేష్ సింగ్, భగవాన్ సింగ్, కమలేష్, ఉదయ్ శర్మ, సందీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# సాయి చిత్ర నగర్ కాలనీలోని గోడౌన్స్, క్యాటరింగ్ ను తొలగించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సాయి చిత్ర నగర్ కాలనీ వాసులు



**ఉప్పల్, అక్టోబర్ 27 ( నమస్తే హైదరాబాద్):** రామంతపూర్ సాయి చిత్ర నగర్ కాలనీలో అక్రమంగా వెలిసిన గోడౌన్స్, క్యాటరింగ్ కంపెనీలను తొలగించాలని కోరుతూ సోమవారం సాయి చిత్రానగర్ కాలనీవాసులు ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ రాజుకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. సాయి చిత్రానగర్ లో అక్రమంగా వెలసిన, ఎటువంటి అనుమతులు లేని, ప్రజలు నివసించే ప్రాంతంలో గోడౌన్స్ నిర్వహించడం వలన ప్రజలు అనునిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రిపూట గోడౌన్స్కు వస్తున్నటువంటి వెహికల్స్ ధ్వని వలన నిద్ర ఉండడం లేదని, వెహికల్స్ నుండి వచ్చే శబ్దాలు , లోడింగ్, అన్లోడింగ్ చేసే వ్యక్తులు బాగా తాగి ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తించడం జరుగుతుందని తెలియజేశారు. జనవాసాల మధ్య ఇలాంటి గోడౌన్స్, క్యాటరింగ్ నిర్వహించడం వలన అగ్నిప్రమాదం సంభవించినట్లయితే, ఎవరు బాధ్యత వహిస్తారని , గత సంవత్సరం దీపావళి పండుగ నాడు, అగ్నిప్రమాదం సంభవించిందని ఆ సమయంలో వచ్చిన అధికారులు తూతూ మంత్రంగా 5000 రూపాయలు ఫైన్ వేసి చేతులు దులుపుకున్నారని ఫిర్యాదు చేశారు .దీనిపై అధికారులు వెంటనే చర్య తీసుకొని జనవాసాల నుండి, దూరంగా గోడౌన్స్ మరియు షెడ్లు క్యాటరింగ్ తదితర కంపెనీలను తరలించాలని, ఆర్.టి.ఐ చట్టం ప్రకారం గోడౌన్ ల అనుమతులు, కమర్షియల్ ప్రాపర్టీ టాక్స్, అనుమతులు ఎవరిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా ఎందుకు ఇచ్చారో తెలియజేయాలని కమిషనర్ ని కోరారు. వారం రోజుల్లో గోడౌన్స్ మరియు క్యాటరింగ్ వారిపై చర్య తీసుకొని, శివారు ప్రాంతాలకు తరలించాలని, లేనిచో కాలనీవాసులు అందరం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని, కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సాయి చిత్రానగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి వి. పరమేశ్వర చారి, వేములకొండ సోమశేఖర్ గౌడ్ ,మల్లయ్య యాదవ్, రామచంద్రారెడ్డి, వేణు, సీతారాం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ గుబులు! తొలిరోజు జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు

### నేడు ఈదురుగాలులతో భారీగా కురిసే అవకాశం

### రైతుల్లో టెన్షన్.. పంటలను కాపాడుకునే పనిలో నిమగ్నం

### జలాశయాలకు వరద

### అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం



**నమస్తే హైదరాబాద్)** 'మొంథా' తుఫాన్ ప్రభా వంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం చిరుజల్లులు కురిశాయి. స్వల్పంగా గాలులు వీచాయి. అయితే సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారింది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురిశాయి. పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప బయటకు రావడానికి సాహసించ లేదు. కాగా మంగళవారం పరిస్థితి పూర్తిగా మారనుం దని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈదురు గాలులతో భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. సాలూరులో ఉదయం నుంచి తేలికపాటి జల్లులు కురవగా.. పలు పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా మార్చారు. పూరిళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. తుఫాన్ హెచ్చరికల వల్ల పార్వతీపురం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలవాసులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. ముంపు సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

ఏజెన్సీలో..సీతంపేట ఏజెన్సీలో చిరుజల్లులు కురిశాయి. అయితే సాయంత్రానికి కుండపోత వర్షం కురిసింది. మరోవైపు మండల స్థాయి అధికారులు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు అప్రమత్తం చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. సాలూరు మండల పరిధి ఏవోబీ కొఠియా కొండల్లో భారీ వర్షం పడింది. వీరఘట్టం, మక్కువ మండలాల్లోని పలు గ్రామాల్లో ఉదయం పది గంటల నుంచి రాత్రి వరకూ జోరు వాన కురిసింది. తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరగ కుండా అధికారుల బృందం విస్తృతంగా పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు సూచించారు.

అన్నదాతల్లో ఆందోళనగరుగుబిల్లి/పాలకొండ: 'మొంథా' తుఫాన్ రైతులకు కంటిమీద కనుకులేకుండా చేస్తోంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేప?థ్యంలో చేతికందొచ్చిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. సోమవారం పాలకొండ మండలంలో పలువురు రైతులు ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేయించి కాకినాడ తదితర ప్రాంతాలకు తరలించారు. మరికొందరు ధాన్యంపై టార్పాలిన్లు కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. ఏదేమైనా సోమవారం సాయంత్రం నుంచి ఓ మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మరింతగా టెన్షన్ పడుతున్నారు. ఈదురు గాలులు, భారీ వర్షాలతో నష్టం తప్పద ంటున్నారు. పంట తడిసిపోయే ప్రమాదం ఉండడంతో మరి కొందరు స్థానిక వ్యాపారులను ఆశ్రయించి హడావుడిగా అమ్మకాలు చేపట్టారు.నేలవాలిన వరిపైరు గరుగుబిల్లి మండలంలో సుమారు 16,280 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అయితే చిన్నపాటి గాలులకు వరి పైరు నేలవాలంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రధానంగా గరుగుబిల్లి, పెద్దూరు, బీవీ పురం, ఉద్దవోలు, దళాయివలసతో పాటు పలు గ్రామాల్లోని వరి పంట అధికంగా నేలవాలింది. పంటను రక్షించుకుందామన్నా వర్షం కారణంగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఉన్నారు. రానున్న రెండు రోజుల్లో ఈదురుగాలుతో భారీ వర్షాలు కురిస్తే మండలంలో సుమారు 500 ఎకరాలకు పైగా వరి పంట ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ఏవో టి.జ్యోత్న తెలిపారు.

వీఆర్ఎస్‌కు వరదమక్కువ రూరల్: శంబర సమీపంలో ఉన్న వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) జలాశయం నుంచి సోమవారం 1000 క్యూసెక్కులను సువర్ణముఖి నదిలోకి విడుదల చేసారు. తుఫాన్ కారణంగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలో వరద పెరుగుతోందని అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు. రాత్రికి ఇన్‌ఫ్లో పెరిగితే దిగువకు మరిన్ని క్యూసెక్కులను విడుదల చేస్తామన్నారు. నదిపరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నిలకడగా నాగావళి గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలోకి సోమవారం పైప్రాంతాల నుంచి 3,900 క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు 5,500 క్యూసెక్కులను విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.14 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. వరద ప్రవాహం మంగళవారానికి పెరిగే అవకాశం ఉ ందని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు, జేఈ బి.కిషోర్‌కుమార్ తెలిపారు నదీ తీర ప్రాంతవాసులను అప్రమత్తం చేశామన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరిం చామని వెల్లడించారు.

వర్షపాతం నమోదు ఇలాపాలకొండ: జిల్లాలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయం త్రం ఆరుగంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉ న్నాయి. పాలకొండ 5.2 మిల్లీమీటర్లు, సీతంపేట 3.2, వీరఘట్టం 5.4, గుమ్మలక్ష్మీపురం 2.4, భామిని 7.8, జియ్యమ్మవలస 4.6, కురుపాం 1.6, పార్వతీపురం 7, కొమరాడ 3.4, గరుగుబిల్లి 12.8, మక్కువ 8, సీతానగరం 8.8, సాలూరు 5, బలిజిపేట 10.4, పాచిపెంట 5.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

రంగంలోకి కలెక్టర్, ఎస్పీతుఫాన్ తీవ్రత నేపథ్యంలో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎటువంటి నష్టం జరగకుండా సిబ్బంది పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. కలెక్టరేట్‌తో అన్ని అన్ని మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. మంగళవారం మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ఉ ద్యోగులకు సూచించారు.అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు : సబ్ కలెక్టర్ పాలకొండ: అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇంటి నుంచి ఎవరూ బయటకు రావొద్దని పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నా?థ్ సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేప?థ్యంలో సోమవారం సాయంత్రం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. 'డివిజన్‌లో కురుపాం, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని కొండ ప్రాంతాల్లో గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి.


# ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ ను సత్కరించిన టిడిపి శ్రేణులు

**నమస్తే హైదరాబాద్ :** పామూరు పట్టణంలో మహాలక్ష్మి డైరీ నందు సోమవారం ప్రకాశం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుల త్రీమెన్ కమిటీ సభ్యులుగా కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారవ రమాదేవి శ్రీనివాసులు వారిని నియమించిన సందర్భంగా పామూరు మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఘనంగా సన్మానం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు పామూరు మండలం సింగిల్ విండో ఛైర్మన్ ఉప్పలపాటి హరిబాబు ,పట్టణ ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అంచురి వెంకటరెడ్డి, నోసం నాగేంద్ర చారి ,పట్టణ తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు ,షేక్ పత్తు మస్తాన్ మండల రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య , గొల్ల వీరబాబు,క్లస్టర్ ఇంచార్జ్ మాలపాటి వెంకటేశ్వర్ రెడ్డి , ఇర్రి శ్రీనివాస్ రెడ్డి, దోబగుంట గ్రామ అధ్యక్షుడు దయుండే శంకర్ , మొబీనా



మౌలాలి, కావేరి రసూల్, షేక్ హజరత్ , ఒగురు నరసింహులు,బండ్ల నారాయణ తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు జనసేన పార్టీ, బిజెపి పార్టీ నాయకులుపాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రాల మూసివేత బొర్రా గుహలను మూసివేసిన దృశ్యం




**నమస్తే హైదరాబాద్ :** మొంథా తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు జిల్లాలోని పర్యాటక కేంద్రాలను మూసివేయాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించిన క్రమంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే సోమవారం నుంచే పర్యాటక కేంద్రాలను మూసివేసి పర్యాటకులను వెనక్కి పంపేశారు. అరకు గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌ను సోమవారం నుంచి మూసివేశారు.బొర్రా గుహలు కూడా..

అనంతగిరి: మండలంలోగల ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను సోమవారం మూసివేసి, పర్యాటకులను అనుమతించలేదు. తహశీల్దార్ వీరభద్రచారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి దేవా, వీఆర్వో దేముడు, ఇతర సిబ్బంది తాటిగుడ జలపాతాన్ని కూడా మూసివేశారు. ఈ కార్యక్రమంలోని వీఆర్‌ఏ లింగమూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యర్రవరం జలపాతం సైతం..

చింతపల్లి: మండలంలోని గొందిపాకలు పంచాయతీ పరిధిలో ఉన్న యర్రవరం జలపాతం సందర్శనలు తాత్కాలికంగా నిలిపివేసినట్టు తహసీల్దార్ కె. శంకరరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం వలన జలపాతం వద్ద ప్రమాదాలు సంభవించే అవకాశముందన్నారు. ఈ మేరకు జలపాతం రహదానికి మూసివేశామన్నారు. మొంథా తుఫాన్ తగ్గే వరకు ఎవరూ జలపాతాన్ని సందర్శించరాదన్నారు. అలాగే చెరువులవేనం వ్యూపాయింట్‌ను సైతం పర్యాటకులు సందర్శించరాదని పేర్కొన్నారు.

# డొంకరాయి జలాశయం నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

### నీటిమట్టం 1,030 అడుగులకు తగ్గే వరకు కొనసాగింపు
### ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు

**నమస్తే హైదరాబాద్ :** సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 15 వేల క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు సోమవారం నుంచి విడుదల చేస్తున్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సీఈ రాజారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,037 అడుగుల కాగా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు 1,036.50 అడుగులకు చేరిందన్నారు. తుఫాన్ నేపథ్యంలో డ్యాం సేఫ్టీ నిపుణుల ఆదేశాల మేరకు జలాశయం నీటిమట్టం 1,030 అడుగులకు తగ్గించే చర్యల్లో భాగంగానే 15 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయానికి 10 వేలు నుంచి 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. కాంప్లెక్సు పరిధిలోని జోలాపుట్, సీలేరు జలాశయాల వద్ద కూడా జెన్‌కో అధికారులను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరద నీటిని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు.

జోలాపుట్టు నుంచి 18 వేల క్యూసెక్కులు నీరు దిగువకు..

ముంచంగిపుట్టు: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాల నుంచి భారీగా నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా జలాశయాల్లో గరిష్ఠ స్థాయిలో నీటిమట్టం నమోదు కావడం, తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ



శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ముందస్తు చర్యల్లో భాగంగా నీరు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. జోలాపుట్టు జలాశయంలో 2,750 అడుగుల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 2747.95 అడుగులకు చేరింది. ఇక్కడ నుంచి మూడు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతంలో గల డుడుమకు 18 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే డుడుమ జలాశయంలో 2,590 అడుగులు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 2,583.60 అడుగులకు చేరింది. ఇక్కడ నుంచి బలిమెలకు 1,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# సిద్ధంగా ఉన్న రోడ్లు, భవనాల శాఖ సహాయక బృందం



### అత్యవసర సహాయక చర్యలకు బృందాలను సిద్ధం చేసిన ఆర్ అండ్
### ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్
### నేడు, రేపు విద్యాలయాలకు సెలవు
### నేటి నుంచి 31 వరకు పర్యాటక కేంద్రాల మూసివేత
### అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**నమస్తే హైదరాబాద్ :** మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధమైంది. పలు శాఖల అధికారులు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ దినేశ్‌కుమార్ గత మూడు రోజులుగా దిశానిర్దేశం చేస్తున్నారు. అతి భారీ వర్షాలు కురిసినా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని పర్యాటక కేంద్రాలను మూసివేశారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధంమొంథా తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లాలో సర్వం సిద్ధం చేశామని, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. ఎస్పీ అమిత్‌బర్దార్, ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో టి.శ్రీపూజతో కలిసి సోమవారం ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మొత్తం 22 మండలాలకు గాను 12 మండలాల్లో తుఫాన్ ప్రభావం ఉంటుందని గుర్తించామని, అలాగే 163 గ్రామాలు ముంపునకు గురవుతాయని గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అత్యవసర సహాయక చర్యలను చేపట్టేందుకు 14 ప్రత్యేక బృందాలను సిద్ధం చేయడంతో పాటు 21 క్రేన్‌లను అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని 11 చోట్ల హెలీప్యాడ్‌లను సైతం సిద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల, గ్రామ స్థాయిలోని అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. అతి భారీ వర్షాలు కురిసినా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. 28, 29 తేదీల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, 28 రాత్రి లేదా 29 తెల్లవారుజామున తుఫాన్ కాకినాడకు సమీపంలో తీరందాటే అవకాశముందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని, ప్రజలు గెడ్డలు దాటవద్దని సూచించారు. చెట్లు కూలినా, రోడ్లు ధ్వంసమైన తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు, తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు పోలీసు బృందాలతో సహా అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి అత్యవసర సాయానికైనా కంట్రోల్ రూమ్ నంబర్: 7780292811 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యాలయాలకు సెలవు ప్రకటించామని, ఆ రోజుల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఆయన సూచించారు. అలాగే 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలన్నీ మూసివేశామని తెలిపారు.అందోళన చెందుతున్న అన్నదాతలుమొంథా తుఫాన్ ప్రభావంతో తమ పంటలు నాశనమవుతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో వేసిన వరి, రాగులు, సామ, వేరుశెనగ, మొక్కజొన్న పంటలు ఆశాజనంగా పండాయి. అలాగే వరి పంట ప్రస్తుతం కోతకు వచ్చే దశకు చేరింది. మరో రెండు వారాల్లో వరి కోతలు ప్రారంభించాలనే ఆలోచనతో గిరిజన రైతులు ఉన్నారు. ఈ క్రమంలో భారీ వర్షాలు కురిస్తే తమ పంటలు నాశనమవుతాయని గిరిజన రైతులు భయాందోళన చెందుతున్నారు.

# గౌతమ్ రెడ్డి దంపతులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు..!



**నమస్తే హైదరాబాద్ :** మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పెద్ద కుమారుడు గౌతమ్ రెడ్డి, కోడలు తేజస్విని రెడ్డిలను ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించారు. సోమవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివాహ రిసెప్షన్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, నవ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశేషంగా తరలివచ్చిన శ్రేణుల జన సంద్రోహానికి అభివాదం చేసిన చంద్రబాబు, ఎమ్మెల్యే జూలకంటి దంపతులకు ఆశీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు

# నేడు పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు సెలవు
## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నమస్తే హైదరాబాద్ :** ,'మోంధా' తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంగళవారం ఆయా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలకు, ఆయా ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించామనీజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఉత్తర్వులను ఆయా రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని ఆదేశించారు.

# పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో కే. శ్రీనివాసులు

**నమస్తే హైదరాబాద్ :** మెంత తుఫాను హెచ్చరికలు సందర్భంగా మండలంలో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు చెప్పారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావస్తు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉండేలా తగిన చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పునరావస్ కేంద్రాల్లో నీటి సరఫరా మరుగుదొడ్లు కరెంటు సౌకర్యాలతో పాటు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మందులను కూడా అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కనపర్తి మాల్యాద్రి, శివకుమార్,ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ రాజశేఖర్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు, లింగసముద్రం వీఆర్వో మౌనిక పంచాయతీ కార్యదర్శి మాధవ, ఆరోగ్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# కోసిగిలో దంచి కొట్టిన వాన



**నమస్తే హైదరాబాద్ :** మొంథా తుఫాన్ కారణంగా సోమవారం మధ్యాహ్నం నుంచే కోసిగిలో వర్షం దంచి కొట్టింది. దీంతో వాగులు, వంకలు పొం గిపొర్లాయి. ముఖ్యంగా కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న చాపవంకకు వరద నీరు పోటెత్తడంతో సుమారు 4 గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒక రి ఒకరు చేతులు పట్టుకుని ప్రజలు చాపవంక దాటారు. స్థానికంగా కొందరు యువకులు టీడీపీ క్లస్టర్-4 ఇన్‌చార్జి, మండల టీడీపీ యువ నాయకుడు జ్ఞానేష్ తమ యువకులతో కలిసి చాపవంక వద్ద ప్రయాణికులను వాగును దాటించారు. అనంతరం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి సహాయ సహకారాలు అందజేశారు. ఎస్ఐ హనుమంతరెడ్డి చాపవంక వద్ద ప్ర యాణికులను, విద్యార్థులను అప్రమత్తం చేస్తూ వంకను దాటిం చారు. యువకుల సాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్ర యాణికులను వాగు దాటించారు. సుమారు గంటల పాటు ట్రాఫి క్ జామ్ కావడంతో వాహనాలు బారులు తీరాయి. మొదటి కార్తీక సోమవారం సందర్భంగా రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఉరుకుందకు తరలిరావడంతో సు మారు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. 5 గంటల సమయంలో వరద ఉధృతి తగ్గిన తర్వాత ముందుకు సాగాయి.

# అర్జీలను నాణ్యంగా పరిష్కరించాలి

**నమస్తే హైదరాబాద్ :** అర్జీదారులను పదే పదే తిప్పించుకోవద్దని, గడువులోపు నాణ్యంగా అర్జీలను పరి ష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ డా.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ అర్జీకి సంబంధించి సరైన విధంగా అర్థమయ్యేలా పూర్తి వివరాలతో ఎండార్స్‌మెంటు తయారు చేసి అర్జీదారులకు వాట్సాప్‌లో పంపించి ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. రీ ఓపెన్, గడువు దాటిన తర్వాత పరిష్కారం ఉండకూదన్నారు. పరిష్కరించలేని సమస్యలైతే అర్జీదారునికి వివరించి చెప్పాలన్నారు. ఆడిట్ ప్రక్రియ వంద శాతం చేయాలని, సీఎంవో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనూరాధ, కొండయ్య, అధికారులు పాల్గొన్నారు.




# సినిమా



## రమ్య మోక్ష ఎలిమినేషన్‌కు కారణాలివే..

అలేఖ్య చిట్టి పికిల్స్ అంటూ పచ్చళ్ల వ్యాపారంతో సోషల్ మీడియాలో బాగా ఫేమస్ అయ్యింది రమ్య మోక్ష. అదే క్రేజ్ తో బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెట్టింది. వైల్డ్ కార్డ్ ద్వారా కంటెస్టెంట్ గా ఎంట్రీ ఇచ్చింది. రమ్య బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెట్టినప్పుడు చాలా రోజులు ఈ రియాలిటీ షోలో ఉంటుందని భావించారు చాలా మంది. కానీ అదేమీ జరగలేదు. తన నోటి దురుసు, దుందుడుకు స్వభావంతో అనవరసరంగా నెగెటివిటీని తెచ్చుకుంది. ముఖ్యంగా టాప్ కంటెస్టెంట్స్ తనూజ, కల్యాణ్ లను టార్గెట్ చేసింది. వారిపై పర్సనల్ అటాక్స్ చేసింది. తనూజను ఫేక్ పిల్ల అని తిట్టిన రమ్య కల్యాణ్ ను అమ్మాయిల పిచ్చోడు అని ముద్ర వేసేసింది. దీనిపై నాగార్జున కూడా సీరియస్ అయ్యాడు. ఆ తర్వాత వీకెండ్ ఎపిసోడ్ లో హైపర్ ఆది కూడా రమ్యకు కొన్ని మంచి టిప్స్ ఇచ్చాడు. కానీ వీటిని కూడా నెగెటివ్ గా తీసుకుంది సోషల్ మీడియా సెన్సేషన్. ఈ కారణంగానే ఫిజికల్ టాస్కుల్లో సత్తా చాటినప్పటికీ ఆడియెన్స్ ఓటింగ్ లో వెనకపడిపోయింది పచ్చళ్ల పాప. నామినేషన్స్ లో నిలిచి రెండో వారమే ఎలిమినేట్ అయ్యింది.మొత్తానికి బిగ్ బాస్ కు రాక ముందు సోషల్ మీడియాలో చాలా నెగెటివిటీని మూటగట్టుకుంది రమ్య మోక్ష. బిగ్ బాస్ హౌస్ లోకి వచ్చినప్పుడు తన ఆటతీరుతో దానిని మార్చేసుకుంటుందనుకున్నారు. కానీ అదేమీ జరగలేదు. పైగా మరిన్ని విమర్శలను, నెగెటివిటీని మూట గట్టుకుని హౌస్ నుంచి బయటకు వచ్చేసింది. అయితే బిగ్ బాస్ ద్వారా రమ్యకు భారీగానే రెమ్యునరేషన్ అందిందని సమచారం. ఆమెకు వారానికి సుమారు రూ.1.50 -2 లక్షల మేర పారితోషికం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన రెండువారాలకు గానూ రమ్య మోక్ష దాదాపు రూ.4 లక్షల మేర అందుకున్నట్లు సమాచారం.





## బ్రౌన్ రైస్ తినడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉంటాయో తెలుసా?

బియ్యం తింటే లావు అవుతారనే ఆలోచన చాలా మందికి ఉంటుంది. అందుకే చాలా మంది తెల్ల బియ్యం కాకుండా బ్రౌన్ రైస్ తింటారు. బ్రౌన్ రైస్ తినడం వల్ల మీకు ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో, తెల్ల బియ్యానికి బదులుగా బ్రౌన్ రైస్ తినడం వల్ల వాస్తవానికి ఏవైనా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయా అని తెలుసుకోవడం విలువైనది.బ్రౌన్ రైస్‌లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ బియ్యం తినడం వల్ల జీర్ణం కావడం సులభం. డైటరీ ఫైబర్ తో బ్రౌన్ రైస్ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది అజీర్ణ సమస్యను తొలగిస్తుంది. బ్రౌన్ రైస్ మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో కూడా ఉపయోగపడుతుంది. అందుకే మలబద్ధకం సమస్యలు ఉన్నవారు బ్రౌన్ రైస్‌ను తీసుకోవచ్చు. ఈ రైస్ మధుమేహం ఉన్నవారికి ఎంతో మంచిదంటున్నారు నిపుణులు.బ్రౌన్ రైస్ తో తయారు చేసిన బియ్యం తినడం కూడా గుండె ఆరోగ్యానికి మంచిది. బ్రౌన్ రైస్ రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

రక్తపోటు స్థాయి తక్కువగా ఉండి, చెడు కొలెస్ట్రాల్ స్థాయి తక్కువగా ఉంటే, గుండె ఆరోగ్యానికి అంత మంచిది. బ్రౌన్ రైస్‌లో విటమిన్ బి, మెగ్నీషియం, భాస్వరం, సెలీనియం, మాంగనీస్ వంటి బహుళ పోషకాలు ఉంటాయి. తెల్ల బియ్యం తయారుచేసేటప్పుడు పైన పేర్కొన్న పదార్థాలను తరచుగా వదిలివేస్తారు. బ్రౌన్ రైస్‌లో కూడా చాలా యాంటీఆక్సిడెంట్లు ఉంటాయని చెబుతున్నారు నిపుణులు.

(నోట్: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నాము.)



## ఇదేం చేస్తుందిలే అనుకునేరు.. పవర్‌ఫుల్ బ్రహ్మాస్త్రం.. సీక్రెట్స్ తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు..

శీతాకాలం ప్రారంభమైంది. ప్రజలు తమ ఆరోగ్యం %-% రోగనిరోధక శక్తిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం మంచిది.. అయితే.. చలి కాలంలో శరీరాన్ని వెచ్చగా %-% ఆరోగ్యంగా ఉంచడానికి ఆహార మార్పులు చాలా అవసరమని నిపుణులు అంటున్నారు. ఈ సమయంలో, శరీరాన్ని చలి నుండి రక్షించడమే కాకుండా రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే ఆహారాన్ని తినాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాంటివాటిలో బీట్‌రూట్ ఒకటి.. దుంప జాతికి చెందిన బీట్‌రూట్‌ను శీతాకాలపు సూపర్‌ఫుడ్‌గా పరిగణిస్తారు. చాలా మంది దీనిని రక్తాన్ని పెంచడానికి తింటారు.. కానీ దాని ప్రయోజనాలు అంతకు మించి ఉంటాయి. దీనిలోని ఐరన్, ఫైబర్, విటమిన్ సి %-% యాంటీఆక్సిడెంట్లు.. శీతాకాలంలో చాలా ప్రయోజనకరంగా మారుస్తాయి.. ఏ వ్యక్తులు దీనికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటారు..? బీట్‌రూట్ ఏ వ్యాధులను తగ్గిస్తుందో తెలుసుకుందాం..

బీట్‌రూట్‌లో పుష్కలంగా పోషకాలు..

బీట్‌రూట్‌లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. హెల్త్‌లైన్ ప్రకారం, దుంపలలో ఫైబర్, ఫోలేట్, మాంగనీస్, పొటాషియం, ఐరన్ %-% విటమిన్ సి వంటి పోషకాలు ఉంటాయి. వాటిలో నైట్రేట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో, వ్యాయామ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. రెగ్యులర్‌గా వాటిని తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి.

ఈ వ్యక్తులకు బీట్‌రూట్ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది..

జీర్ణ సమస్యలు లేదా మలబద్ధకంతో బాధపడేవారికి బీట్‌రూట్ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. శీతాకాలంలో దీన్ని తినడం వల్ల కడుపు సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. హెల్త్‌లైన్ ప్రకారం, ఈ పండు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఒక కప్పు బీట్‌రూట్‌లో దాదాపు 3.4 గ్రాముల ఫైబర్ ఉంటుంది.. ఇది ఫైబర్ కు మంచి మూలంగా మారుతుంది. ఫైబర్ మన శరీరంలో పూర్తిగా జీర్ణం కాదు. ఇది పెద్దప్రేగుకు చేరుకుంటుంది.. మంచి బ్యాక్టీరియాను పోషిస్తుంది.. మలాన్ని స్థూలంగా, మృదువుగా చేస్తుంది.. మలబద్ధకాన్ని నివారిస్తుంది.. అలాగే ప్రేగును శుభ్రంగా ఉంచుతుంది.

బీట్‌రూట్ ఈ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.. బీట్‌రూట్ జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది.. మలబద్ధకం %- ×దీూ% (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్) వంటి సమస్యలను నివారిస్తుంది. ఇంకా, దుంపలలో లభించే ఫైబర్ తీసుకోవడం వల్ల పెద్దప్రేగు క్యాన్సర్, గుండె జబ్బులు %-% టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గించవచ్చు.

బీట్‌రూట్ అద్భుతమైన 5 ప్రయోజనాలు బీట్‌రూట్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది.. ఇది శీతాకాలపు వ్యాధుల నుండి రక్షిస్తుంది.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

## సర్ఫరాజ్ ఖాన్‌కు అండగా ముంబై క్రికెట్.. అగార్కర్‌తో యుద్ధానికి సై అంటోన్న అజింక్య రహానే

టీమిండియా టెస్ట్ జట్టులో అవకాశం కోసం ఎదురుచూస్తున్న యువ క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ విషయంలో చోటు చేసుకున్న పరిణామాలు ఇప్పుడు దేశ క్రికెట్‌లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. రంజీ ట్రోఫీలో గత కొన్ని సీజన్లలో స్థిరంగా పరుగులు సాధిస్తూ, అద్భుతమైన ఫస్ట్-క్లాస్ సగటును (65o యావరేజ్) కొనసాగిస్తున్నప్పటికీ, సర్ఫరాజ్ ఖాన్‌ను జాతీయ జట్టులోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ ఈ విషయమై సరైన వివరణ ఇవ్వలేదని ముంబై క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే సందర్భంలో, ముంబై జట్టు తరపున ఆడుతున్న సీనియర్ ఆటగాడు అజింక్య రహానే, సర్ఫరాజ్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు.

రహానే మాటల సారాంశం..

"సర్ఫరాజ్ ఖాన్ వెనుక ముంబై క్రికెట్ మొత్తం ఉంది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా ఆడుతున్న ఆటగాళ్లకు జాతీయ జట్టులోకి అవకాశం దక్కాలి. ముంబై ఆటగాళ్లు



అత్యున్నత స్థాయిలో ఆడాలని మేం కోరుకుంటున్నాం" అంటూ రహానే చెప్పుకొచ్చాడు.తన విషయంలోనూ సెలెక్టర్ల నుంచి ఎలాంటి సంభాషణ లేదని రహానే ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవం గల ఆటగాళ్లను తప్పించినప్పుడు, దానికి గల కారణాలను వారికి తెలియజేయాల్సిన బాధ్యత సెలెక్టర్లపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

క్రికెట్‌లో వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని రహానే అన్నారు. రెడ్-బాల్ (టెస్ట్) క్రికెట్‌పై మక్కువ, నిబద్ధత ముఖ్యం కానీ, ఆటగాడి వయసు కాదన్నారు. మైఖేల్ హస్సీ వంటి ఆటగాళ్లను ఉదహరిస్తూ, అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు జాతీయ జట్టులో ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని రహానే అభిప్రాయపడ్డారు.

అగార్కర్‌పై 'యుద్ధానికి సిద్ధమా'..?

సర్ఫరాజ్ ఖాన్‌ను జట్టులోకి తీసుకోకపోవడంపై కొంతకాలంగా విమర్శలు వస్తున్నప్పటికీ, రహానే చేసిన ఈ తాజా వ్యాఖ్యలు సెలక్షన్ కమిటీపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. 'ముంబై క్రికెట్ సర్ఫరాజ్ ఖాన్ వెనుక ఉంది' అని రహానే అనడం, తన పాత సహచరుడు, ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అయిన అజిత్ అగార్కర్‌కు పరోక్షంగా హెచ్చరిక పంపినట్టుగా క్రికెట్ పండితులు భావిస్తున్నారు. ఈ పరిణామం ముంబై క్రికెట్‌లో రహానే వర్సెస్ అగార్కర్ అనే ఒక అంతర్గత చర్చకు తెర లేపింది.



## అకస్మాత్తుగా మహ్మద్ షమీని కలిసిన బీసీసీఐ సెలెక్టర్.

భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక కాకపోవడం నిరంతరం వార్తల్లో నిలిచింది. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక కానప్పటికీ, షమీని ఆస్ట్రేలియాలో జరిగిన వన్డే సిరీస్‌కు కూడా విస్మరించడం అనేక ప్రశ్నలను లేవనెత్తింది. తాను ఎంపికకు ఫిట్‌గా ఉన్నానని మీడియాలో షమీ స్వయంగా ప్రకటించడం సంచలనం సృష్టించగా, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తన ఫిట్‌నెస్ ఎంపికకు తగినది కాదని బహిరంగంగా ప్రకటించాడు. మీడియాలో ఇటువంటి బహిరంగ ప్రకటనల తర్వాత బీసీసీఐ ఇప్పుడు ఒక కీలక అడుగు వేసింది. బోర్డు సెలక్షన్ కమిటీ సభ్యుడు ఒకరు షమీని నేరుగా కలుసుకుని ఎంపిక అంశంపై సుదీర్ఘంగా చర్చించారు.రంజీ ట్రోఫీ మ్యాచ్ సందర్భంగా షమీని కలిసిన ఆర్పీ..ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక కాని స్టార్ పేసర్ షమీ ప్రస్తుతం బెంగాల్ తరపున రంజీ ట్రోఫీలో పాల్గొంటున్నాడు. టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో షమీ తన బౌలింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. రెండవ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. ఈసారి, కొత్త సెలక్షన్ కమిటీ సభ్యుడు, మాజీ ఫాస్ట్ బౌలర్ రుద్ర ప్రతాప్ సింగ్ అతని బౌలింగ్‌ను వీక్షించడానికి హాజరయ్యారు. స్పోర్ట్స్‌కీడా నివేదిక ప్రకారం, రెండవ రోజు ఆట తర్వాత ఆర్‌పి సింగ్ షమీని ప్రత్యేకంగా కలిశాడు. అక్కడ ఇద్దరూ సుదీర్ఘ సంభాషణ జరిపారు.షమీ ఫిర్యాదు చేశారా లేదా ఆర్‌పీ సింగ్ తన ప్రకటనలపై అభ్యంతరం చెప్పారా అనేది అస్పష్టంగా ఉన్నప్పటికీ, మీడియాలో అకస్మాత్తుగా వెలువడిన ఈ ప్రకటనలు భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించిన తీరు, ఇటీవలి సంఘటనలు ఈ సమావేశంలో కీలక పాత్ర పోషించాయని సులభంగా ఊహించవచ్చు. సెలెక్టర్లు తరచుగా రంజీ ట్రోఫీ మ్యాచ్‌లను చూడటానికి వివిధ వేదికలకు ప్రయాణిస్తున్నప్పటికీ, వారు ముఖ్యంగా టీం ఇండియా ఆటగాడితో కూడిన మ్యాచ్‌లను కూడా చూస్తుంటారు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..